


గోడ అలమరలోనుంచి చిన్న గడియారం అలారం కొట్టీ కొట్టీ మధుని నిద్రలోనుంచి పిలక పట్టుకు లేపేసింది. "నీ మొహమ్మండ! నీ కొంప మునిగి పోయిందటే అప్పుడే!" అని తిట్టుకుంటూ పక్కమీదనుంచి లేచి బాత్రూమ్ వైపు పరుగెత్తాడు.

రోజూ తెల్లారగట్ల నాలుగు గంటలకి నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని, మూడు ముస్తాబులూ అయ్యేనరికి మధుకి అలమరలో చిన్న గడియారం నవ్వుతూ, "అయిదున్నర!" అని చెప్తుంది. "నీ శ్రాద్ధం చెట్టు కింద పెట్టా!" అని ముద్దుగా దాన్ని తిట్టి వెళ్తా డతను డ్యూటీకి.

ఆ నమయానికి ఇంటినుంచి బయటపడి బస్టాండుకు పరుగెత్తి తన క్కావలసిన బస్సును పట్టుకోవా లతను. ఆ ఊరి పక్క ఊళ్లో ఒక ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు మధు. ఏడాదైంది ఆ ఉద్యోగం వచ్చి. రెండు వేల రూపాయలు నమర్పించుకుని మరీ ఆ ఉద్యోగాన్ని నంపాదించుకున్నా డతను ఓ మధ్యవర్తిద్వారా. బియ్యే సెకండ్ క్లాసైనా, ఫైవు హయ్యరైనా, ఆటల్లో సర్టిఫికెట్లున్నా - అవేవీ అతనికి ఆ ఉద్యోగం ఇవ్వలేదు. కేవలం డబ్బే ఇచ్చింది! అదే ప్రభుత్వోద్యోగం రావాలంటే రెండువేలతో రాదని తెలిసింది. ఇంకా చాలా ఎక్కువే ఇచ్చుకోవాలట! ఆ ఊళ్లో ఆ ప్రైవేటు కంపెనీలో మధు గుమాస్తా. జీతం వెయ్యి రూపాయలు.

'గుడ్డిలో మెల్ల' అనుకున్నా డతను.


ఆరుగంటలకి బస్టాండ్‌లో ఆ ఊరు వెళ్లే బస్సుని పట్టుకోకపోతే మరో బస్సు వచ్చినా దొరకదు! డ్యూటీయేమో ఉదయం ఎనిమిది గంటలకు కచ్చితంగా ప్రారంభమవుతుంది! ఆ యజమాని కర్కోటకుడు! అంటే, అతని పే రదని కాదు, చాలా కచ్చితమైన, రాక్షస, దుష్ట, దుర్మార్గ ... ఇత్యాది బిరుదులు పొందినవాడు.

మధు ఎంత వేగిరం తెమిలీ, ఎంత ఠంచనుగా డ్యూటీకి చేరినా, "ఇంత లేటా?" అని రోజూ అడుగుతాడు బాస్. దాంతో మధుకి ఎక్కడ మండిపోవాలో అక్కడే మండిపోతుంది భగ్గుమని! వినీ వినీ తిక్కరేగిపోయి, ఒకరోజున -

"అలా అంటారేమి ట్సార్! నేను ప్రతిరోజూ త్వరగానే డ్యూటీకి వస్తున్నా కదా! ఇదిగో చూశారా, టైము?" అని చెప్తే, బాస్ అగ్గి అయిపోయి, "చాలింక! ఎదిరించకు! ఎవరైనా ఎదిరిస్తే నే ననలు నహించలేను!" అన్నాడు.

"ఇందులో ఎదిరించడం ఏముంది సార్?"

"నో, రీజన్స్ తీయకు. పాయింట్లు లాగకు,




అర్గ్యుమెంట్లు చేయకు!'' అని అరిచా డతను.

'నీ పిండాకూడు పిల్లులకి పెట్టా!' అని తిట్టుకున్నాడు మధు.

అసలు సంగతి ఏమిటంటే, బాస్ భగవంతం ఇంట్లో సుఖం లేదని తెలిసింది స్టాఫ్‌కి. అతని భార్యకి విపరీతమైన కోపం! బోలెడు తిక్క! మహా ఉద్రేకం! గొప్ప పొగరూ!

భగవంతాన్ని నోరెత్తనివ్వదు ఆవిడ! తిండి శుభ్రంగా పెట్టదు. ఆవకాయ, చారూ, అప్పడం తప్ప మరో పదార్థం భర్త విస్తట్లో అమర్చదు. హొటల్‌కి పోయి తిన్నాడు భగవంతం నాలుగైదుసార్లు. అన్నిసార్లు అతనికి హొటల్ తిండి పడక వాంతులు అవీ అయి కైలాసానికో, వైకుంఠానికో వెళ్లిపోతాడేమో అని అనిపించేది. పాపం, అతను భార్య వంటకి అంకితమైపోయి రాత్రిళ్లు కలల్లో ఇష్టమైన వంటకాలు తింటూ ఉంటాడు. పగలు ఆ అసంతృప్తితో తన పరివారాన్ని తింటూంటాడు ఆఫీసులో. ఆయనకు ఇంకా సరదా లుండేవి గానీ, వాటన్నిటినీ భార్య బలవంతంగా చంపేసింది.

ఆ రోజు భగవంతం - "ఏం చేస్తున్నారయ్యా! గడ్డి కోస్తున్నారా ఆఫీసులో?'' అనడిగాడు కోపంగా.

మధు చిన్నప్పటి నుంచి తల్లితండ్రులను, గురువులనూ ఎవరినీ లెక్కచేయలేదు. వాళ్లందరినీ ఎదిరించినవాడు ఈ బాస్‌కి లొంగిపోతున్నాడు. అతని వ్యక్తిత్వం, అహంకారం అప్పుడప్పుడూ తేలులా తోక ఎత్తుతోంది. పాములా పడగ ఎత్తుతోంది. పులిలా పంజా ఎత్తుతోంది. అయితే అవసరం వాటన్నిటినీ దాని పిడికిట్లో పట్టేస్తోంది.

ఈ ఉద్యో..ం తప్ప మరో గతి లేదు తనకు. మానేద్దామంటే వెనక ఆస్తిపాస్తు లేవీ లేవు. రేపు పెళ్లి చేసుకోవాలంటే, భార్యని పోషించాలంటే డబ్బుండాలి. జీతం నెల నెలా వచ్చే ఉద్యోగం ఉండి తీరాలి. ఆమెను సినిమాకు తీసుకెళ్లాలా! చీర కొనమంటే కొనాలా? ఉద్యోగం చేసే అమ్మాయి దొరికితే పరవాలే దనుకున్నాడు కాని ఒకవేళ అలాంటి పిల్ల దొరక్కపోతేనో! కాబట్టి తను ఆమె కోసం, తన కోసం కూడా చచ్చినట్టు ఈ భగవంతంగాడికి లొంగితీరాల్సిందే నన్నమాట!

ఒకతను ఆ రోజు సెలవుపెట్టాడని భగవంతం ఆఫీసంతా కథాకేళీ, కంగాళీ చేసేశాడు. మర్నాడు అతగా డొస్తే ఓంర్ర పెట్టాడు.

"ఎందుకు పెట్టావు సెలవు? చెప్పా చేయకుండా ఎందుకు మానేశావ్! ఇదేమైనా మీ అబ్బ కంపెనీ అనుకున్నావా?"

"నే నలా అనుకోలే ద్సార్!'' అని చెప్పా డతను వినయంగా.

"మా అబ్బాయికి ఒంట్లో బాగాలేదని సెలవు పెట్టాను, సార్!'' అని అన్నాడు.

"అయితే మీ ఆవిడ లేదా ఇంట్లో? పిల్లల సంగతి తల్లి చూసుకోదా? మగాడివి! నువ్వేం చేస్తావు? ను వ్వేమైనా పాలు పడతావా? ఉయ్యా లూపుతావా?"

"నేను డాక్టరు దగ్గరకు తీసుకెళ్లాను, సార్! నా కొడుకుని."

"మీ ఆవిడ తీసుకెళ్లనని చెప్పిందా?"

అతగాడికి కొంచెం కారం కంట్లో చల్లినట్లయింది.

"మా ఆవిడ చాలా మంచిది. అలా ఏమీ ఎదిరించదు నన్ను. చాలా మంచి భార్య" అని చెప్పాడు.

"ఓహో! అంటే, నా భార్య చెడ్డదనా నీ మాట? అదేనా నీ మా టనలు!'' భగవంతం భగభగ మండిపోయాడు.

అతను నవ్వుకుని తన సీట్లోకి వెళ్లిపోయాడు.

భగవంతానికి మధ్యాహ్నం కారులో ఇంటి నుంచి కేరేజీ వస్తుంది. డ్రైవరు కారులో వెళ్లి అమ్మగా రిచ్చిన భోజనం కారులో తీసుకొచ్చి అయ్యగారికి అందజేస్తాడు. మూడు గిన్నెల కేరేజీలో ఒక గిన్నెలో అన్నం, ఒకదానిలో చారూ, మరొకదానిలో ఇంత ఆవకాయ, అప్పడం ఉంటాయి.

"వెధవ గొప్ప! వెధవ చారుకి కారు ఒహటీ! హుఁ, ఉన్నా ఒహటే, లేకపోయినా ఒకటే అది! వేగిరం చచ్చినా బావుణ్ను! దాని మీద అప్పడాలేసి చారు పోసి తగలేస్తాను!'' అని భగవంతం కేరేజీని బూతులు తిట్టి, బుర్ర బరుక్కున్నాడు.

స్టాఫ్ అందరికీ భగవంతాన్ని చూస్తే జాలి కలిగింది కాని, కోపం ఆ జాలిని మింగేసింది. తమతో మంచిగా ఉంటే ఆయనకు తామే కావలసిన వంకాయ, బంగాళదుంప కూర, పప్పు పులుసూ, కొబ్బరిపచ్చడీ అవీ సరఫరా చేద్దురేమో!

చెడ్డగా ఉన్నవాడికి శ్రాద్ధం తప్ప ఏం పెడతారు ఎవరైనా? అని అనుకున్నారు వాళ్లు ఉక్రోషంగా.

మధు తల్లిదండ్రీ వాళ్ల ఊరునుంచి ఉత్తరం రాశారు. మధు చదివిందేమో ఆ ఊళ్లో. వచ్చిందేమో; బాబాయి వరసైన బంధువింటికి - ఉద్యోగం వెత్తుక్కునేందుకు ఈ ఊరికి.

అసంతృప్తి ఉద్యోగం, అప్రదిష్ఠ ఉద్యోగం వరించింది తనను. లాట్రీకి పది రూపాయ లిచ్చి టికెట్టు కొంటే అయిదు రూపాయ లొచ్చినా ఇంతగా ఫీలయ్యేవాడు కాడేమో తను. ఈ ఉద్యోగం రాగానే బంధువు ఇంటి నుంచి ఒక చిన్న గదిన్నర ఇంటికి మారిపోయా డతను. సిగరెట్టు పెట్టెంత గది! అగ్గిపెట్టెంత బాత్రూము! అద్దెకున్నవాణ్ణి చంపి ఇంటిగలవాడు బతుకుతున్నాడు.

నాన్న రాసిన ఉత్తరంలో ఆయన మొహం కనిపించలేదు గాని, పెళ్లి పెళ్లి పెళ్లన్న గోల, గొడవా ఉత్తరం అంతా నిండిపోయి కనిపించాయి. 'నీ కేదో ఒక ఉద్యోగం వచ్చింది గదా! కనుక ఇంక చేసెస్కో! మేము ఒహ సంబంధం సిద్ధం చేసేశాం! పిల్లని వచ్చి చూడు! వాళ్ల కిది అయిదో పిల్లా, ఆఖరి పిల్లానుట!'' అని రాశాడాయన.

'చచ్చానురా దేవుడా!' అనుకున్నాడు మధు.

అయిగురు ఆడపిల్లలే! ఆఖరి పిల్లా? అయితే ఇంకేమిస్తారు వాళ్లమొహం. అందరికీ అన్నీ ఇచ్చేయగా అడుగూ మడుగూ చిప్పా దొప్పా ఇస్తారు. వెధవ కర్మ తనకి! ప్రైవేటు ఉద్యోగం ప్రారబ్ధం ఉద్యోగం. వెయ్యి రూపాయలిచ్చి లక్ష అవమానాలు చేసే ఈ ఉద్యోగం లాగే ఆ పెళ్లాం కూడా తనకు ప్రాప్తం కాబోలు, పరాత్పరా!'' అని వాపోయాడు మధు.

ముప్పైరోజుల్లో ముప్పయ్ ఉత్తరాలు రాసీ రాసీ నాన్న మధు బుర్రని కొరికి తినేశాడు, నమిలి మింగేశాడు. తన బుర్రంటూ ఒక్క పిసరులేదు గనుక బుర్రకి నచ్చిన పిల్ల, మూడు ముళ్లేయించుకుంది. ముసిముసిగా నవ్వుకుంది. తొలి రాత్రి శోభన్‌బాబులా ఉంటాడు తన భర్తనుకుని ఆమె ఊహించింది. మదిలో బాబు, గదిలో బాబూ ఒక్కలా లేకపోయేసరికి ఆమె ఎంతో బాధపడిపోయింది.

మధు మధుపర్కాలు వదిలేశాక మళ్లా మామూలు మనిషిగా మారిపోయాడు. స్నేహలత పేరంత బాగలే దనుకున్నాడు. జడ స్వంతం కాదు, సవరం జడ లాగితే వచ్చేసింది. కళ్ల చూపూ స్వంతం కావు. చాలా దళసరి అద్దాల కళ్లద్దాలు తీస్తే బొత్తిగా ఏమీ కనిపించక తడుముకుంటోంది.

"నోట్లో పళ్లు నీవేనా?'' అని అడిగాడు మధు.

"ఆఁ ... రెండు తప్ప అన్నీ నావే!'' అని చెప్పింది స్నేహలత ధైర్యంగా.

"అంతేనా, ఇంకా అడగండి! ఏమీ మొహమాట పడకండి!"

"శరీరం మీదవి, మిగిలినవి నీవేనా, కాదా? అవి కూడా తెచ్చిపెట్టుకున్నవేనా అని అడగలే దేం?"

అని అంటూ గబగబా అన్నీ తీసేసి వక్కన వడేసిం దామె.

"చూశారా! మీ డౌట్లు తీరిపోయాయా?"

అతను మొహం ఎర్రగా చేసుకున్నాడు.

"మీ జుత్తు, ఆ క్రాఫింగ్ మీదేనా, మేకవ్పు షాపులోదా? ఆ మీసం మీ స్వంతమేనా? మొహానికి ఏ ప్లాస్టిక్కు సర్జరీనో చేయించుకుని యౌవనంగా పీట ఎక్కలేదు కదా! ఏమో, మీ సందేహాలు, అనుమానాలు చూస్తే మరీ ముసలాళ్లే అని నాకూ డౌట్లు వస్తున్నాయిలెండి!" అంటూ నవ్వింది గట్టిగా.

"ఛీ!" అన్నా డతను వినుగ్గా.

"ఎందుకు ఛీ! ఎందుకండీ ఛీ! తమరు నన్ను ఎక్స్‌రే తీయవచ్చు గానీ, నేను మిమ్మల్ని ఎక్స్‌రే తీయకూడ దేం? నా జుత్తు చాలా ఎక్కువే ఉండేది! టైఫాయిడ్ వచ్చి బోలెడు జుత్తు ఊడిపోతే, సవరం జడేసుకున్నాను. అది నా తప్పా! ఇవ్పుడు కళ్లద్దా లెవరికి లేవు? అవి రావడం కూడా నేరమేనా? పదహారేళ్లవ్పుడు పడిపోయి రెండు పళ్లూడిపోతే అవి కట్టించాడు మా నాన్న!"

మధు 'చచ్చా' ననుకున్నాడు.

'భగవంతానికి బాబులా ఉంది ఇది!' అనుకున్నా డతను.

"భార్య అందంగా అంతా బాగుండాలని నే ననుకోకూడదా! అలా అనుకోవడం తప్పా, నేరమా?" అ నడిగాడు తిక్కగా.

"పదివే లిచ్చాను కదా, ఫీజు!"

"ఎందుకు, నోర్మూసుకోమనా?"

"మ రందుకేగా!" అంటూ లైటార్పేసింది. నిజంగా నోరు మూసేసింది. ఆడ ధైర్యం మగ తిక్కని మళ్లీ మూలగకుండా ముంచేసింది.

పదివేల కట్నంతో మంచి ఉద్యోగం కొనుకుందా మనుకున్నాడు మధు.

కాని, అక్కడా అతని కోరిక నెరవేరలేదు.

కట్నం పదివేలలో పిల్లకి బంగారం పెట్టా లన్నారు ఆడ పెళ్లివారు. పట్టు చీర లన్నారు - పట్టుబట్టారు. అవ్పు డనలు నాన్న బుర్రే నడిపించింది కనుక మధు మాటా, మనసు పనిచేయలేదు. పదివేలకి ఎనిమిదివేలు స్నేహలతే దిగమింగేసింది. ఇక ఉన్న రెండువేలూ ముష్టి ఎందుకు తనకి! - అని లోలోపల కుతకుత ఉడికిపోయాడు.

తన కిద్దరు మొగుళ్లు! ఒకరు స్నేహలత, మరొకరు భగవంతం!

పెళ్లికి సెలవు మూడ్రోజులు, మూడు వందల మూలుగులు మూలుగుతూ ఇచ్చేడు భగవంతం. మధుకి ఇది కూడా అసంతృప్తే! ఎవరైనా ఏ నెలరోజులో హానీమూన్ వెళ్తారు. తనకి ఏ మూనూ లేదు! భగవంతంగాడే తన మూను! వాడి ఇంటికి దొంగతనంగా వెళ్లి వాడి పడగ్గదిలో టైమ్‌బాంబు పెట్టేస్తాను. దాంతో వాడి పై మయిపోతుంది, పీడా పోతుంది!" అని తిట్టుకున్నాడు.

శుభ్రమైన చిన్న ఇల్లు కావాలని, వాళ్లనీ వీళ్లనీ అడిగాడు మధు. ఆ చిన్న ఇరుకింటిలో ఇద్దరూ ఇమిడి గడపటం కష్టంగా, ఇబ్బందిగా ఉంది! ప్రయత్నిస్తే ఎలాగో దొరికింది ఇల్లు. అయితే అది ఊళ్లో దొరకలేదు. దూరంగా, ఎడంగా వెలివేసినట్టు ఉంది!

అక్కడ పొలాలున్నాయ్! ఆకాశం ఉంది. ఒకటో, రెండో మాత్రం పెంకుటిళ్లున్నాయి. నాలుగో, అయిదో కమ్మరేకు లిళ్లున్నాయి. అక్క డో బోరింగ్ ఉంది. అది చేతులు పడిపోయేటట్టు కొడితే ఒక బిందెడు నీళ్లు మహా కష్టంగా, ఇష్టం లేనట్టు ఇస్తుంది. లేబరున్నారు గదా అని వాళ్లనడిగి మరి నాలుగు బాల్చీలు పోయమన్నాడు.

"బాల్చీ రూపాయిన్నర!" అని వాళ్లు బరితెగించినట్టు పలికితే బావురుమనబోయి ఆవుకున్నా డతను.

"బేరం లేదా?" అనడిగాడు.

"పావలా తగ్గిస్తాం, అంతే!" అని చెప్పేసి వాళ్లెళ్లిపోతూ, "పొండిరా పొండి!" అని సినిమా పాటలా అని.

"హు! మేం మనుషులం కామా! మాలో దేహబలం లేకపోయినా ఆత్మ బలం ఉందిరా! దాంతో ఏ కార్యమైనా సాధిస్తాముురా! మీరే ఉన్నారా!" అన్నాడు మధు తిక్కగా.

"నువ్వు కొట్టు, నేను పడతాను" అన్నాడు స్నేహలతతో.

"బోరింగా! అమ్మో! ఇ దేం కర్మ బాబోయ్! బోరింగంటే నాకు భయం బాబూ!"

"అలా అనకు. భయాలు అన్నీ నహీఁ హై! నాకు నువ్వు, నీకు నేను! మనిద్దరికీ ఆ బోరింగు! పద, పద! చలో చలో! జిస్ దేశ్ మే గంగా బెహతీ హై! కష్టపడితేనే గంగ కావలసినంత వస్తుంది! భగీరథుడు ఎంత కష్టపడ్డాడో తెలును కదా! ఆయన కంటే మనం గొప్పవాళ్లమా!" అని బోరేశా డామని.

స్నేహలత వినుక్కుని, తిట్టుకుని వెళ్లింది.

అయిదు నిముషాల్లో ఇద్దరి చేతులూ పక్షవాతం వచ్చినట్టు వేలాడిపోయాయి. లేబర్ని బతిమాలుకుని వాళ్లకి టీలూ, తిండీ ఇచ్చుకుని బాల్చీ రూపాయి చేసుకుని ఒవ్పందానికి వచ్చారు.

ఆ చుట్టుపక్కల ఓ కూరలకొట్టు కానీ, పచారీ దుకాణంకానీ మానవుడి కనీస అవసరాలు తీర్చే వేవీ లేకపోవడం కూడా తమ ఖర్మంలో ఒక భాగమే! - అని వాపోయాడు మధు. 'ఈ పెళ్లి వల్ల తన మటుకు తనకు సౌఖ్యం అనబడే దేదీ లభ్యం కావడంలేదు' అని విచారించా డతను. ఒక సైకిల్ సెకండ్‌హేండ్‌ది కొనుక్కున్నాడు. రోజూ డ్యూటీ నుంచి వచ్చాక కానీ, లేదా వస్తున్నవ్పుడే దోవలో కావలసినవి కొనుక్కువస్తున్నాడు చచ్చినట్టు. ఇది మరో అవస్థ.

ఆ రోజు స్నేహలత తేలుకుట్టినట్టు గెంతసాగింది.

"నేరకపోయి చేసుకున్నా నీ పెళ్లి! ఒక అచ్చటా లేదూ, ముచ్చటా లేదూ! ఎవరైనా చక్కగా షికారు కెళ్తారు. సినిమాకి వెళ్తారు. హానీమూను అసలే లేదు. పాడు కాపురం, పాడు బతుకు! ఎంతసేపూ వండుకోవడం, తినడం, పడుకోవడం! ఛా!"

"అయితే ఏమంటావే ఇంతకీ!" అన్నాడు మధు చికాకుగా.

"ఏమి టా మాట? గోడకి చెవుతున్నానా? తలుపుకు చెవుతున్నానా నేను!" అని అరిచిం దామె.

అతనికి ఒళ్లు మండింది.

"ఎంతసేపూ వెధవ డ్యూటీ! పాడు ఉద్యోగం!" ఆ మాట అత నెన్నిసార్లో రామనామ జవంలా అనుకుంటున్నాడు కాని ఆ మాటే భార్య అనడం సహించలేకపోయాడు.

ఆ రోజు ఎలాగో ఓపిక చేసుకుని సైకిల్ మీద స్నేహలతని కూర్చోబెట్టుకుని రెండో ఆట సినిమాకి వెళ్లొచ్చారు. మరునాడు తొందరగా లేవలేకపోయా డతను. సినిమాలో హీరో హీరోయిన్ల వాడీ, వేడీ కళ్లారా చూసి పూర్తిగా చల్లారేసరికి మధు మంచం దిగడం మహా కష్టమైపోయింది.

డ్యూటీ రాక్షసుడు కోపం కోరలతో రంకె లేశాడు.

"ఎందు కింత లేటైంది? పెళ్లాన్ని వదల్లేకపోయావా?"

ఆ మాటకి మధుకి ఎంతో సిగ్గేసింది.

"మీ ఆవిడ చేసే పనులన్నీ నువ్వే చేస్తున్నావా ఇంట్లో?"

"మా ఆవిడ అంత చెడ్డది కాదు, సార్!"



"ఆహా! అయితే మా ఆవిడ చెడ్డదనా, నీ మాట!"

"ఏమో, సార్!"

భగవంతం తెయ్యిమని గెంతి - "నీ క్యూడా పొగ రెక్కువైంది. ఉండండి, మీ తోకలు తెగ్గోస్తే గానీ మీకు బుద్ధి రాదు!" అన్నాడు.

తోకల ఊసెత్తితే వర్కర్లందరూ అలో పాలో మన్నారు.

ఆ నెలలో భగవంతం స్టాఫ్ అందరికీ నూటికి అరవై రూపాయలే ఇచ్చాడు. నూటికి అరవై చొప్పున మధుకి వెయ్యికి ఆరు వందల రూపాయలు జీతం వచ్చింది. అందరూ గగ్గోలు పెట్టారు.

స్టాఫ్ అంతా ఒక చోట సమావేశమయ్యారు. టీలు ప్రవహించాయి చర్చలతో.

"ఇంత ... ఇంత అన్యాయం ఏ చోటా ఉండదు!"

"మరీ ఇంత దారుణమా! వాడి కేదో పోయేకాల మొచ్చింది!"

"అయినా ఆయన సంగతి తెలును కదా! వాళ్లావిడ ఊసు ఎందుకయ్యా ఎత్తుతారు?"

"వాళ్లావిడ ఊసు అస లెవరయ్యా ఎత్తారు?"

"ఏం, మా ఆవిడ ఊసు అతగాడు ఎత్తవచ్చా? పాడు బుద్ధి!"

"ఎంత అసహ్యంగా మాట్లాడుతున్నాడో విన్నారా మీరు! మా ఇంటి విషయాలు అతని కెందుకండీ! నోరిప్పితే అందరి పెళ్లాల గురించి ఎంతో అసహ్యంగా వాగుతాడు. వాడి పెళ్లాం వాడి నెన్ని బాధలు పెడుతోందో, మనం వాణ్ని అడుగుతున్నామా?"

"శుభ్రంగా ఇంత తిండి పెట్టదు మొగుడికి! ముండా కొడుకు, ఆ కోపాలన్నీ మన మీద చూపిస్తా డేమిటండీ!"

"అసలు మనలో ఒక యూనిటీ లేదండీ! మనందరం ఒక మాట మీద ఉంటే వాడు చచ్చినట్టు మన మాట వింటాడు. మర్యాద ఇస్తాడు. మంగళహారతి పాడడు!"

"వాడికి బొత్తిగా ధర్మం, కర్మం లేవండీ! కావలిస్తే చూడండి, మనం లేకపోతే వాడికి జరగదని అందరం కట్టకట్టుకుని పనులు మానేశా మనుకోండి! వెంటనే కొత్తవాళ్లని పిలుస్తాడు."

"ఏడిశాడు! వాళ్లెలా వస్తారో చూస్తాం! కాళ్లు విరగ్గొడతాం!"

రెండు రోజులు వర్కర్లంతా సమ్మె చేశారు. పని మొత్తం ఆగిపోయింది. భగవంతం మొదట నిశ్చేష్టుడయ్యాడు. తర్వాత గంతులేశాడు. తర్వాత కొత్తవాళ్లని పిలిపించాడు. మధుకి, మరో అరడజనుమందికి మహా తిక్కరేగింది. మిగిలిన వాళ్లతో - "మీ రేమీ ఉద్రేక పడవద్దు! మేము వాళ్లని ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కుతాం!" అని చెప్పి, "ఆగండయ్యా! భగవంతం సంగతి మీ కేం తెలును? అతను మీ భార్యల్ని అవమానిస్తాడు. ఆడవాళ్లని అవమానించే పాడు బుద్ధి ఉంది! మీ రా అవమానాన్ని భరిస్తారా?" అనడిగాడు.

వాళ్లు "భరించలేం!" అన్నారు.

"మీరు మాత్రం ఎలా సహిస్తున్నారు?" అనడిగారు వాళ్లు.



"మేము అలవాటు పడిపోయాం. అయినా భగవంతం పాడుబుద్ధిని ఇక సహించం! మా సమ్మెను దయచేసి కొనసాగనీయండి. మీ పెళ్లాల్ని గౌరవంగా బతకనీయండి. వాళ్ల మర్యాదను మీరు కాపాడండి! భగవంతం చేత వారి పరువు తీయకండి!" అని చెప్పగానే కొత్తవాళ్లు మటుమాయమైపోయారు.

భగవంతం భార్య దగ్గరికి కొంతమంది వెళ్లారు మధుతో.

"మీ ఆయనగారికి నరాలు చచ్చుబడిపోయాయి. మేము డాక్టర్‌ని తీసుకెళ్లి చూపించాము!" అని చెప్తే, అలో పాలోమంటూ, "ఎక్కడున్నారు? న న్నక్కడికి తీసుకెళ్లండి" అంది.

విపరీతమైన ఉద్రేకంతో భగవంతానికి శరీరమంతా వణికి, అతను ఉన్నపళంగా నేల మీద పడిపోయాడు. లేపితే లేవలేక పోయాడతను. మధు వెంటనే డాక్టర్ని తీసుకువచ్చి, తర్వాత భగవంతం భార్యకి ఈ వార్త చెప్పాడు.

"పక్షవాతమా?" అడిగిం దామె ఏడుస్తూ.

"అటువంటిదేసట! బలం లేకపోవడం వల్ల ఇలా జరిగిందట. బలమైన ఆహారం ఇవ్వాలట. ఆయన ఉద్రేక పడకూడదు, అసలు మాట్లాడటం మానేసి బాగా విశ్రాంతి తీసుకోమని చెప్పారు డాక్టరు."

డాక్టరు చెప్పింది ఆవిడ విని, కన్నీటితో - "అలాగే" అని చెప్పింది.

భగవంతం పూర్తిగా నెల రోజులు డాక్టరు చెప్పిన విధంగా ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకున్నాడు. మధు కంటే సీనియరు బాపిరాజు భగవంతం ఛార్జ్ తీసుకున్నాడు.

మధు బాపిరాజుతో - "చరిత్ర మలుపు తిరిగింది. కోలుకుని వచ్చాక, భగవంతం ఇదివరకటి రాజ్యమే మళ్లీ చేస్తాడేమో!" అన్నాడు.

"అలా చేయడులెండి, ఎందుకంటే ఇది అతడి ప్రాణానికీ, చావు బతుకులకీ, జీవితానికీ, వాడి పెళ్లాం మాంగల్యానికీ సంబంధించిన విషయం! మళ్లీ గెంతితే మళ్లీ పడతాడు. ఏమో, ఈ సారి ప్రాణమే పోవచ్చు కదా!" అన్నాడు బాపిరాజు.

భగవంతంలో మార్పు బాగా వచ్చింది. ముఖంలో ఒక తృప్తి. మనిషిలో ఉపశమనం, తశ్శాంతి, నిదానం అనీ ఏర్పడ్డాయి. డాక్టరు సలహా ప్రకారం నింపాదిగా, నిదానంగా అందరితో మాట్లాడుతున్నాడు. ఎవరినీ కొంచెం కూడా తూలనాడటంలేదు. అసలు బాపిరాజు చేతే పనంతా చేయిస్తూ అతనికే బాధ్యత వదిలి తను నామమాత్రంగా వస్తున్నాడు. వర్కర్లకి ఆ పండుగకి బోనస్‌లు కూడా వచ్చాయి.

కొన్ని నెలల్లో జీతాలు పెరిగాయి అందరికీ.

"నా కేదో భయంగా ఉంది!" అన్నాడు మధు బాపిరాజుతో.

"చెడ్డవాడు ఒక్కసారి మంచిగా మారిపోతే నా కేమిటోగా ఉంది."

"ఎవరికోసం మారతాడయ్యా! ఎంతకాలం ఏల్తాడు చెడ్డతో? రావణాసురుడూ, హిరణ్యకశిపులే అణిగిపోయారు. టైమయ్యా! టైము!! భగవంతం వాళ్లకంటే ఘనుడా? చెప్పవయ్యా!" అన్నాడు బాపిరాజు.

మధు, స్నేహలత వాళ్లింట్లో ఈ మధ్య ఏదో కొత్త కొత్త పాటలు వినిపిస్తున్నాయి.

స్నేహలత ట్రాన్సిస్టర్ పెట్టుకుని, "ఉయ్యాల జంపాల ఊగరావయా!" అని పాత పాట కొత్త గుండెతో కమ్మ కమ్మగా పాడేస్తోంది సుమండీ!

మధు కేమో డ్యూటీలో బ్యూటీ కనిపిస్తోంది.

★